## క్లుప్తంగా

### బాలోత్సవంలో సాయిశ్రీకి తృతీయ బహుమతి



మెమొంటో అందుకుంటున్న విద్యార్థిని

**తాళ్లూరు:** ప్రకాశం బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ ఒంగోలు పీవీఆర్ బాయ్స్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. చిత్రలేఖనం సబ్ జూనియర్స్ విభాగంలో జరిగిన పోటీలో తాళ్లూరు మండలం బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పోలంరెడ్డి జోషిక సాయిశ్రీ తృతీయ బహుమతి సాధించి నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంస పత్రం, మెమొంటో అందుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, పద్మావతి, ఉషారాణి పాల్గొన్నారు.

### రైతులకు విశిష్ట సంఖ్య తప్పని సరి



మల్లంపేటలో ఫార్మర్ రిజిస్టర్ చేస్తున్న సిబ్బంది

**దొనకొండ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పథకాలు అందాలంటే రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య తప్పని సరి అని మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మల్లంపేట రైతు సేవా కేంద్రంలో గ్రామ ఉద్యాన అధికారి అగ్రి స్టాక్‌లో చేస్తున్న విశిష్ట సంఖ్య నమోదు పద్ధతిని ఆదివారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందిస్తారన్నారు. పొలం ఉన్న ప్రతి రైతు ప్రభుత్వ పథకాలు రైతులు పొందాలంటే తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రంలో గ్రామ సహాయకులను సంప్రదించాలని ఏఓ రైతులను కోరారు.


### శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ



దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న పూజారులు, భక్తులు

**కురిచేడు:** స్థానిక జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠాచార్యులు సాయినరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు, దేవులపల్లి విశ్వనాథం శాస్త్రి లు వేద మంత్రోచ్ఛరణలతో దక్షిణామూర్తి, చండీశ్వర, కాలభైరవ మూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కట్టమూరి నాగేశ్వరరావు, కొత్త వెంకట అయ్యప్ప శెట్టి, పోతిరెడ్డిపల్లి రవికుమార్, సుబ్బయ్య శాస్త్రి, ఎస్‌వీ ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లలోనే కందులు.. ధర లేక దిగాలు



గుడిపాడులో ఇంట్లో నిల్వ ఉంచిన కందులు

- ప్రారంభం కాని కందుల కొనుగోలు కేంద్రాలు
- దొనకొండ మండలంలో 7650 ఎకరాల్లో కంది సాగు
- దిగుబడి తగ్గి, మద్దతు ధర కరువైందని రైతుల వేదన

**దొనకొండ:** ఆరుగాలం శ్రమించి వ్యవసాయం చేసినా ఆశించిన దిగుబడి రాక దిగాలు చెందుతున్న రైతులు.. మద్దతు ధర లేకపోవడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. పండించిన కంది పంటను ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. దొనకొండ మండలంలో సుమారు 7650 ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. రుద్రసముద్రం, భూమనపల్లి, మంగినపూడి, అనంతవరం, ఇండ్లచెరువు, ఆరవల్లిపాడు, పెదన్నపాలెం, గుడిపాడు, గంగదేవిపల్లి, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో రైతులు కంది పంట అత్యధికంగా సాగు చేశారు.

**తగ్గిన దిగుబడి**

ఎకరాకు సుమారు రూ.15 వేల నుండి రూ.20 వేలు ఖర్చు చేసి రైతులు కంది పంట సాగు చేశారు. తీరా పంట నూర్పిడి చేశాక దిగుబడి రెండు క్వింటాళ్లు మాత్రమే రావడంతో రైతులకు మనోవేదనే మిగిలింది. గత ప్రభుత్వంలో కంది పంట ఇళ్లకు చేరేలోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించేవారు. దీంతో దళారుల వ్యవస్థ దాదాపు కనుమరుగైంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం క్వింటా కందులకు మద్దతు ధర రూ.7,550 మాత్రమే ప్రకటించడం, నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో గ్రామాల్లో దళారుల వ్యవస్థ పెరిగిపోయింది. క్వింటా కందులను రూ.6 వేలకే అడుగుతుండటంతో రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



### కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఈ సీజన్‌లో 9 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. దిగుబడి 10 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు అయింది. గతంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చారు. నేడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తోంది.

– బోరెడ్డి నాగిరెడ్డి, గంగదేవిపల్లి

**రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. రైతులు పండించిన మిర్చి, పత్తి, కందుల ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ఎన్నికల ముందు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తాం, రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత విస్మరించడంతో తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా రైతులందరికీ న్యాయం చేసేలా గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

### గిట్టుబాటు ధర కల్పించాలి



6 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. పెట్టుబడి కోసం సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేశా. కందుల దిగుబడి మాత్రం 9 క్వింటాళ్లు వచ్చింది. అమ్ముకోవాలంటే ధర లేదు. రాష్ట్ర ప్రభుత్వం సరైన మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

– వెన్రి కోటిరెడ్డి, గంగదేవిపల్లి

# ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఏదీ..



అధికారులను ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు



సమావేశం నుంచి బయటికి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం
- తీర్మానం, ప్రొటోకాల్ పాటించని అధికారులు

**పెద్దారవీడు:** ప్రజా ప్రతినిధులకు కనీసం గౌరవం ఇవ్వని ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులకు అధికారులు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య ప్రజా సమస్యలపై ఆదివారం ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 12 గంటలకు ప్రారంభమైంది. గత సమావేశంలో ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కొన్ని శాఖల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. వాటికి సమాధానం చెప్పాల్సి వస్తుందని మండల స్థాయి అధికారులు రాకుండా కింద స్థాయి సిబ్బందిని పంపించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కిందస్థాయి సిబ్బంది సమాధానం చెప్పలేక మీరు అడిగిన ప్రశ్నలు మేము పేపర్లో రాసుకుని వాటిని మా అధికారులకు తెలియచేస్తామని చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులు, పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ గ్రామ సభలు, ప్రభుత్వ సమావేశాలకు ఏ ఒక్క మండల స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ముందుగా టీడీపీ నాయకులకు సమాచారం ఇచ్చి వారిచే కార్యక్రమాలు చేయిస్తున్నారని, ప్రజలతో ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు రాజ్యాంగ నిబంధనలు వర్తించడంలేదని ధ్వజమెత్తారు. సానికవరం, రామాయపాలెం గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పంచాయతీలో నిధులు లేకపోతే ట్యాంకర్ల ద్వారా నీటిని ఎలా సరఫరా చేస్తామని సర్పంచులు నిలదీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబ మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ నిధులతో ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్లకు ఎలాంటి తీర్మానం, సమాచారం లేకుండా టీడీపీ నాయకులతో అధికారులు కుమ్మక్కై రోడ్లు వేశారని సర్పంచులు అంగిరేకుల ఆదినారాయణ, పొందుగల వెంకటరెడ్డి, వజ్రాల రామలక్ష్మమ్మ, ఎంవి రమణారెడ్డి, దుగ్గెం చెన్నమ్మలు మండిపడ్డారు. పంచాయతీ రాజ్ ఏఈ ఆదిరెడ్డి సిమెంట్ రోడ్ల గురించి మాట్లాడుతూ తీర్మానం చేయించాల్సింది, ప్రొటోకాల్ పాటించాల్సింది పంచాయతీ కార్యదర్శి అని, మాకు సంబంధం లేదని చెప్పడంతో సమావేశం నుంచి ఎంపీటీసీలు, సర్పంచులు బాయికాట్ చేశారు. సమావేశం హాలు నుంచి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బయటకు వచ్చారు. దీంతో వెంటనే సర్పంచులను సమావేశానికి రావాలని ఎంపీడీఓ జాన్‌సుందరం సూచించారు. చివరకు సమావేశంలో నలుగురు ఎంపీటీసీలు మాత్రమే ఉండటంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ సుధాకర్, హౌసింగ్ ఏఈ శ్రావ్య, గ్రంథపాలకులు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు దూదేకుల పకీరయ్య, ఉప్పాలపాటి భాగ్యరేఖ, గోదాపు సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**మొక్కుబడిగా సమావేశాలు:**

మూడు నెలలకు ఒక సారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. ప్రతిసారి సమావేశాల పేరిట తూతూ మంత్రంగా కాలయాపన చేస్తూ బిస్కెట్, టీ ఇచ్చి పంపించేందుకు నిర్వహిస్తున్నారని, ప్రజా సమస్యలపై సమావేశాన్ని ఏర్పాటు చేయకుండా ఎంపీపీ, ఎంపీడీఓ కలిసి తీర్మానం చేసుకొని బిల్లులు చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు ఆరోపించారు.

## రామిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ

**పెద్దదోర్నాల:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు యక్కంటి రామిరెడ్డి కుటుంబ సభ్యులను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యక్కంటి రామిరెడ్డి తండ్రి యక్కంటి బ్రహ్మారెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో ఎమ్మెల్యే తాటిపర్తి ఆదివారం రామిరెడ్డి దంపతులను పరామర్శించి బహ్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యక్కంటి రామిరెడ్డిని పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మండల నాయకులు యక్కంటి లింగారెడ్డి, యక్కంటి వీరనారాయణరెడ్డి, జోగి వెంకట నారాయణ, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, వెన్నా కాశిరెడ్డి, గంటా గురవారెడ్డి, అల్లు రమణారెడ్డి, చిట్టి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.



యక్కంటి రామిరెడ్డి దంపతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

## తెలుగు జాతి కీర్తి పతాక శ్రీకృష్ణదేవరాయలు

**ఒంగోలు మెట్రో:** దేశ భాషలందు తెలుగు లెస్స అని ఎలుగెత్తి చాటిన తెలుగు జాతి కీర్తి పతాక శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తితో మనమందరం తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలని సాహితీ లోకం పిలుపునిచ్చింది. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీకృష్ణ దేవరాయుల 554వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ 500 ఏళ్ల నాడే తెలుగు భాషకు, తెలుగు జాతికి, తెలుగు నేలకు విశిష్టత ఖ్యాతి కల్పించిన రాయలవారిని స్మరించుకోవాల్సిన బాధ్యత యావత్ తెలుగు జాతిపై ఉందన్నారు. సంగీతం, సాహిత్యం చిత్రలేఖనం, నాట్యం, శిల్పం వంటి లలిత కళలకు కృష్ణరాయల పరిపాలన స్వర్ణ యుగం లాంటిది అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డా.నారపుశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వ వైభవాన్ని చేకూర్చడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ , లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డా.సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతాంధ్ర, కన్నడ భాషల్లో తిరుగు లేని భాషాకవి చక్రవర్తి కృష్ణదేవరాయలని అన్నారు. కార్యక్రమంలో తూము సుబ్బారావు, వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మిడసల మల్లికార్జున రావు, జి.ఓబుల్ రెడ్డి, మాగంటి శ్రీనివాసమూర్తి, మెడబలిమి సాంబశివరావు, డా.మొగిలి దేవప్రసాద్, పి.గోవర్ధన్ రెడ్డి, ఐ.మురళీకృష్ణ, మద్దులూరి వెంకట సుబ్బారావు, వల్లెపు మురళి, కొప్పోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతగానితనంతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేయడంతో అన్నివర్గాల వారు అష్టకష్టాలు పడుతున్నారు. చివరకు వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయులకు ఉపయోగపడే పింఛన్లు వంటివాటిని కూడా కొత్తవారికి మంజూరు చేయకుండా సీఎం చంద్రబాబు పక్కన పెట్టేయడంతో వారంతా తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా కొత్త పింఛన్లకు అర్హులైన వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వారు దరఖాస్తు చేసుకునేందుకు నేటికీ వెబ్‌సైట్ ప్రారంభం కాకపోవడమే అందుకు నిదర్శనం.

# కొత్త పింఛన్.. పరేషాన్..!

- చీమకుర్తి మండలంలో భారీ సంఖ్యలో కొత్త పింఛన్లకు అర్హులు
- కూటమి ప్రభుత్వం సంబంధిత వెబ్‌సైట్ కూడా ఓపెన్ చేయకపోవడంతో అవస్థలు
- అధికారంలోకి వచ్చి 8 నెలలైనా పట్టించుకోకపోవడంతో విమర్శలు
- మండలంలోని సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియలా అమలైన కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు

**చీమకుర్తి రూరల్:** చీమకుర్తి మండలంలో కొత్తగా పింఛన్లకు అర్హత పొందిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పింఛన్లకు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ప్రారంభం కాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలు కొత్త పింఛన్లతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా వెరిఫికేషన్ పేరుతో ఇప్పటికే ఉన్న పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో మండలంలోని లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

**వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే దరఖాస్తులు, పింఛన్లు...**

గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు ప్రక్రియను నిరంతరం కొనసాగించారు. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అర్హుల నుంచి అవసరమైన పత్రాలు స్వీకరించి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అనంతరం కూడా ఇంటి వద్దకే వచ్చి ప్రతినెలా ఒకటో తేదీ పింఛన్ అందించారు. కానీ, నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసలు ఆ వెబ్‌సైటే ఓపెన్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా ప్రజాసంక్షేమాన్ని నీరుగారుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త పింఛన్ల దరఖాస్తు చేసుకునేందుకు నిత్యం సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని అర్హులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా కొత్తగా వివాహాలైన వారు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా వెబ్ సైట్ ఓపెన్ కాకపోవడంతో ఎదురు చూపులు చూస్తున్నారు.

**సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు...**

మండలంలోని మంచికలపాడు గ్రామానికి చెందిన రావూరి హనుమంతరావు అనే వృద్ధుడికి ఐదు నెలల క్రితమే 60 సంవత్సరాల వయసు నిండింది. పింఛన్‌కు అర్హత వచ్చింది కదా అని దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే ఇంకా వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదన్నారని వాపోయాడు. మంచికలపాడు గ్రామానికే చెందిన కొండ్రు తిరుపతమ్మ అనే మహిళకు 60 సంవత్సరాలు. వితంతు పింఛన్ కోసం ఎనిమిది నెలల నుంచి సచివాలయం, కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. కానీ, పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌కు అనుమతులు రాలేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఆవేదన వ్యక్తం చేస్తోంది. పాటిమీదపాలెం గ్రామానికి చెందిన కూడలి రోశమ్మ తన భర్త చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళ్లి సిబ్బంది చెప్పిన సమాధానం విని తీవ్ర నిరాశకు గురైంది. చీమలమర్రి గ్రామానికి చెందిన ఆవులూరి సతీష్ కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయానికి వెళ్లినా నిరుత్సాహం తప్పలేదు. ఇలా మండలంలో కొత్త పింఛన్లకు అర్హులైన వారు తమకు పింఛన్ పొందే భాగ్యం ఉందో..లేదో అని చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి**

కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలి. ప్రభుత్వం అనుమతులిచ్చి వెబ్‌సైట్ ప్రారంభించిన తర్వాతే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. అంతవరకు సంయమనం పాటించాలి.

– కె.రాఘవేంద్ర, ఎంపీడీఓ, చీమకుర్తి

**సామాన్య ప్రజల సమస్యలు పట్టించుకోని కూటమి సర్కార్**



అధికారంలోకి రాగానే ఎన్నికల వేళ చెప్పిన సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. తీరా చూస్తే సామాన్య ప్రజ సమస్యలు పట్టించుకోకపోగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న అరాచక పాలన గమనిస్తున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు అప్పుడే సిద్ధమవుతున్నారు.

– కర్నాటి హరిబాబు, సర్పంచుల సంఘ చీమకుర్తి మండల అధ్యక్షుడు

**ఎనిమిది నెలలైనా తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు**



గతేడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్లు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ కాకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రజలు సచివాలయాలకు వెళ్లి నిలదీస్తున్నారు. 2024 జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– పెరికల నాగేశ్వరరావు, సర్పంచ్, మంచికలపాడు

**సచివాలయాల సేవలు ఎప్పుడో**



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు పూర్తవుతున్నప్పటికీ సచివాలయాల ద్వారా సామాన్యుడికి ఒక్క పనీ కావడం లేదు. ఏ పనీ అవ్వక, వెబ్‌సైట్లు ఓపెన్ కాక సామాన్యుడి బాధలు అన్నీఇన్నీ కావు. ఇవన్నీ పట్టించుకోని ప్రభుత్వం సామాన్యుడి ప్రభుత్వం కాదు. సచివాలయాల ద్వారా గత ప్రభుత్వంలో మాదిరిగా అన్ని సేవలు అందుబాటులోకి ఎప్పుడు వస్తాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– జడ మరియదాసు, చీమలమర్రి

**కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న పింఛన్ల తొలగింపు**



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు. సంపద సృష్టించే వ్యవహారం ఇక చెప్పనక్కర్లేదు. సామాన్యులకు కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న పింఛన్లు తొలగించే పనిలో పడిన కూటమి ప్రభుత్వం.. ఇప్పటికైనా కళ్లుతెరిచి సచివాలయాల ద్వారా అన్ని సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– కూడలి మాలకొండయ్య, పాటిమీదపాలెం

### ఘనంగా గంగాభవానికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు

**తాళ్లూరు:** మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు గ్రామ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటిగంగలో వేంచేసిన గంగాభవానికి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు కామేశ్వర శర్మ, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలోని మల్లికార్జున స్వామి, నాగమ్మ తల్లి విగ్రహాలను పూజించారు. ఆలయ చైర్మన్ కే.గురుబ్రహ్మం, ఈవో గుంటపల్లి వాసు పర్యవేక్షించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.